క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు అందజేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్‌కు చెందిన కుంట రాఘవరెడ్డి తన తల్లిదండ్రులు సాయమ్మ, సంగారెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచిన దాసరి శ్రీకాంత్‌కు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుణమణికి రూ.5 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి 10 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.5 వేలు, ఏడు, ఐదవ తరగతుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.2,500 చొప్పున నగదును అందజేస్తామని చెప్పారు. అనంతరం కుంట రాఘవరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం అబ్దుల్ జమీన్, గ్రామసర్పంచ్ బాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సాయిలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వాడిలో పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ పరిశీలించారు. వాడి గ్రామానికి చెందిన ఓటర్లు చీనూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో చీనూర్‌లోని పోలింగ్‌కేంద్రాన్ని వాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపేందుకు ఆర్డీవో పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతులపై ఆయన ఆరా తీశారు. ఆయనవెంట తహసీల్దార్ మహేందర్ కుమార్, వాడి, చీనూర్ జీపీ కార్యదర్శులు నరేష్, సరేందర్ తదితరులున్నారు.

ఫిజియోథెరపి క్యాంప్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం వికలాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 9 మంది వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్, సీఆర్‌పీ హైమద్ పాష తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్ రావు 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఇద్దరిని నిజామాబాద్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, శేఖర్, వైద్యులు శివకుమార్, సిద్ధిరామగౌడ్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి

పిట్లం(జుక్కల్): పిట్లంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 73వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘన నివాళి అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మాండ్లు, పట్టణ అధ్యక్షుడు శివ, నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్‌లో క్రీడా సామగ్రిని శుక్రవారం గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి యువతకు పంపిణీ చేశారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు క్రీడా సామగ్రిని యువకులకు ఉచితంగా అందజేశారు. క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లక్ష్మారెడ్డి సూచించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వాహనాలను భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు నిబంధనలను పాటించాలని, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపయోగంగా ధోబీఘాట్లు

బీటలు వారిన నీటి తొట్టీలు

- పని చేయని బోరు మోటారు
- కుంటలను ఆశ్రయిస్తున్న రజకులు
- మూగజీవాలకు సైతం చుక్కనీరు లభించని వైనం



శిథిలావస్థకు చేరిన బోరుబావి



సదాశివనగర్ శివారులో నిరుపయోగంగా మారిన ధోబీఘాట్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఉత్తునూర్, వజ్జపల్లి, ధర్మారావ్‌పేట్, కుప్రియాల్, పద్మాజీవాడి తదితర గ్రామాల్లో 12 ఏళ్ల క్రితం నిర్మించిన ధోబీఘాట్లు నిరుపయోగంగా మారాయి. రజకుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఊరూరా ధోబీఘాట్లను నిర్మించింది. కానీ ధోబీఘాట్లకు ప్రత్యేకంగా బోరు వేయించకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. కొన్ని గ్రామాల్లో ధోబీ ఘాట్లకు నీటి సదుపాయం కోసం బోరు బావులను తవ్వించినా ప్రయోజనం లేకుండా పోయింది. బోరు బావులు చెడిపోవడంతో మరమ్మతులు చేయించడానికి ఇటు పంచాయతీ పాలక వర్గాలు, ప్రజాప్రతినిధులు ముందుకు రాకపోవడంతో బోర్లు తుప్పుపట్టి పోయాయి. పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. ధోబీఘాట్ల వద్ద నీటి వసతి లేకపోవడంతో రజకులు చెరువులు, కుంటలను ఆశ్రయిస్తున్నారు. చెరువులు, కుంటల్లో ప్రమాదపుటంచున బట్టలు ఉతకాల్సి వస్తోందని రజకులు పేర్కొంటున్నారు.

పట్టించుకునే వారు కరువు

రజకులకు బట్టలు ఉతకడానికి నిర్మించిన నీళ్ల తొట్టీలు బీటలు వారాయి. వేసిన బోరు బావులు తుప్పుపట్టిపోయాయి. పైప్‌లైన్‌లు పనికిరాకుండా పోయాయి. తాము ధోబీఘాట్ల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని రజకులు చెబుతున్నారు.కొన్ని సంవత్సరాలుగా దోబీఘాట్ల గురించి పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని వారు పేర్కొన్నారు.

ఉపయోగంలోకి తేవాలి



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్మించిన దోబీఘాట్లను ఉపయోగంలోకి వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి. దోబీఘాట్ల వద్ద రజకులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.
– పున్నం రాజయ్య, రజక సంఘం జిల్లా బాధ్యులు

ప్రత్యేక నిధులు కేటాయించాలి



దోబీఘాట్లను ఉపయోగంలోకి తేవడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. పదేళ్ల నుంచి చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఘాట్ల వద్ద నీటి వసతి లేకపోవడం వల్లనే కుంటలు, చెరువుల వద్దకు పోయి బట్టలు ఉతకాల్సి వస్తోంది.
–ఎంపాట సాయిలు, సదాశివనగర్

నీటి వసతి కల్పించాలి



దోబీఘాట్ల వద్ద మొదటగా నీటి వసతి కల్పించాలి. బోర్లు వేయించాలి. నీటి వసతి ఉంటేనే ఘాట్ల వద్దకు వెళ్లి బట్టలు ఉతకడానికి అవకాశం ఉంటుంది. ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి వసతి కల్పిస్తే రజకులకే కాదు మూగజీవాలకూ నీటి వసతి ఏర్పడుతుంది.
–కొత్తింటి సాయిలు, సదాశివనగర్

మట్టి రోడ్డును బీటీగా మార్చండి



తాడ్వాయిలోని గురుకుల పాఠశాలకు వెళ్లే దారి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి బాలికల గురుకుల పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. కొన్నేళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై ఎన్నో సార్లు మొరం పోసినప్పటికి వర్షం వస్తే మొరం కొట్టుకుపోతుందన్నారు. దీంతో రోడ్డు గుంతలమయంగా తయారైందన్నారు. ప్రతి రోజు ఈ రోడ్డుపై వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనాలు సైతం వర్షాకాలంలో తరచుగా జారి బోల్తా పడడంతో పలువురికి గాయాలు అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేనైనా చొరవ తీసుకొని ప్రత్యేక నిధులను మంజూరు చేయించి అధ్వానంగా తయారైన ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

రాష్ట్ర హాకీ టీంకు విద్యార్థినుల ఎంపిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థినులు అండర్ –14 రాష్ట్ర స్థాయి హాకీ టీమ్‌కు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమోద దేవి శుక్రవారం తెలిపారు. ఎంపికైన టి.వైష్ణవి, పి.లాస్య, సీహెచ్.మేఘన, ఎం. హరిణి అనే విద్యార్థినులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకుంటున్న డిజిటల్ విద్యాబోధన



బాన్సువాడ రూరల్: అగస్త్య ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న డిజిటల్ విద్యాబోధన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోందని దేశాయి పేట్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ వారు తయారు చేసిన 30 గణితం, సైన్సు మాడ్యూల్స్‌ను ప్యానల్ బోర్డ్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ శంకర్, ఉపాధ్యాయులు నరేందర్, సుంక్య, శంకర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు కృషి

- ఏఎంసీ చైర్మన్ పిప్పిరి వెంకటి



మాట్లాడుతున్న పిప్పిరి వెంకటి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ పెంపునకు కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ పిప్పిరి వెంకటి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల మృతిచెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్బుల లక్ష్మీపతికి సంతాపం తెలిపారు. అనంతరం గత 3 నెలల్లో జరిగిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. రాబోయే రోజుల్లో కమిటీ ఆదాయం పెంచుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఏడీఏ అపర్ణను రైతులకు వరి, ఆరుతడి పంటలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. డైరెక్టర్లు మాలావత్ రవీందర్, చేడె రాజ్యలక్ష్మీ, షేక్ అజీజ్, బండారి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సదుపాయాన్ని కల్పించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామానికి ఆర్టీసీ బస్సు సక్రమంగా రావడం లేదని, వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీటీసీ సంకరి లక్ష్మీరాజలింగం కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి బస్సు సక్రమంగా వచ్చేలా చూస్తామని డీఎం హామీ ఇచ్చినట్లు ఎంపీటీసీ లక్ష్మి తెలిపారు. దీంతో డీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఐ లింగమూర్తి, అజీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్ చేయకపోతే ఎలా?

- జీర్యూర్ తహసీల్దార్‌ను నిలదీసిన టీపీసీసీ సభ్యుడు కాసులు బాల్‌రాజ్

బాన్సువాడ: ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీరా నది నుంచి ఇసుక వెలికి తీసి తరలించుకుపోతుంటే రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తోందని టీపీసీసీ సభ్యుడు కాసుల బాల్‌రాజ్ ఆరోపించారు. బీర్కూర్ శివారులోని మంజీరా పరివాహక ప్రాంతంలో ఇసుక కుప్పలను సీజ్ చేయాలని 2 నెలల క్రితం బాన్సువాడ ఆర్డీవో భుజంగరావును కలిసి ఫిర్యాదు చేయగా పూర్తి విచారణ చేపట్టి ఇసుక డంపులను సీజ్ చేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా తహసీల్దార్ జనార్దన్ 2 నెలలుగా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గణేష్, నేతలు జమాల్ సర్వర్, బోయిని గంగాధర్ ఉన్నారు.

బడీడు పిల్లలతో పని చేయిస్తే కటకటాలే..



బడి బయటి పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ



బాణాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీలు

మాచారెడ్డి: బడీడు పిల్లలతో పని చేయిస్తే కటకటాల పాలవుతారని మాచారెడ్డి సీఆర్‌పీ దేవ సంజీవ్ హెచ్చరించారు. శుక్రవారం అక్కాపూర్, తడకపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అక్కాపూర్ శివారులోని ఇటుక బట్టీలో పని చేస్తున్న మహారాష్ట్ర వలస కార్మికుల పిల్లలు ఏడుగురు బడి బయటి పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా సీఆర్పీ మాట్లాడుతూ.. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఒక వేళ వారితో పనిచేయిస్తే పనిలో పెట్టుకున్న వాళ్లతో పాటు తల్లిదండ్రులు శిక్షార్హులని అన్నారు.

లింగంపేట పరిధిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్‌లో శుక్రవారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడిమానేసిన విద్యార్థులను గుర్తించారు. బడి మధ్యలో మానకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీఆర్పీలు సంజీవ్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ జి.రమణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ జి.రమణ మాట్లాడుతూ..ప్రణాళికకు అనుగుణంగా చదువుకోవటంలో మార్పులు, పరీక్ష సమయంలో ఒత్తిడిని అధిగమించడం, పరీక్షల్లో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరును వివరించారు. మానసిక ఆరోగ్యం కాపాడుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. మానసిక సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని, అవసరమయ్యే కౌన్సిలింగ్ తీసుకోవడం చేయాలని సూచించారు. ప్రతి రోజు యోగా, మెడిటేషన్, ఆటలాడటం లాంటివి చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఆస్మా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రేణుక, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారిణి అనిత, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న బీజేపీ నాయకులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి గెలుపొందిన సందర్భంగా 1వ వార్డు బీజేపీ నాయకులు తమ మొక్కును తీర్చుకున్నారు. అడ్లూర్ గ్రామంలోని రామాలయం, కోట మైసమ్మ ఆలయంలో 102 కొబ్బరి కాయలు కొట్టి మొక్కును తీర్చుకున్నారు. కార్యక్రమంలో పెరుమాండ్ల శంకర్, తదితరులున్నారు.

పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



భిక్కనూరు: అంతంపల్లిలోని వనదుర్గ పెద్దమ్మ ఆలయం అభివృద్ధికి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మంజుల సంజీవరెడ్డి శుక్రవారం రూ.15,116లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబీకులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. పిట్ల రాజయ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మున్నూరు కాపు సదరు సంఘం రామారెడ్డి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాండ్ల నర్సింలు, సెక్రటరీగా కడెం భైరయ్య, జాయింట్ సెక్రటరీగా ఆరుగొండ ప్రసాద్, కోశాధికారిగా ఇసాయిపేట్ భైరయ్య, ఉపాధ్యక్షుడిగా నేరెళ్ల నర్సింలు, ఎర్రోళ్ల స్వామిని ఎన్నుకున్నారు. సభ్యులుగా రమేశ్, కట్ల కుంట్ల లక్ష్మీరాజు, బాలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామారెడ్డి మున్నూరుకాపు సంఘం 12 బేడల సంఘం అధ్యక్షుడు, సభ్యులు, కుల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రామారెడ్డి మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, రామారెడ్డి సదరు సంఘం మాజీ అధ్యక్షుడు కాసర్ల లింగం పాల్గొన్నారు.

కృష్ణానందస్వామి జ్ఞానయోగ ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి శుక్రవారం స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్‌లో జ్ఞాన యోగా ప్రవచనాలు చేశారు. విద్యార్థులతో శ్రీరామకోటి జపింపజేశారు. పరీక్షల్లో విజయానికి ఏకాగ్రత, ప్రాముఖ్యతను వివరించారు. పాఠ్య పుస్తకాల పఠనంతో పాటు ఆధ్యాత్మిక చింతన, తెల్లవారుజామున నిద్రలేవడం ఎంతో ముఖ్యమని కృష్ణానంద స్వామి వివరించారు.

డాక్ సేవకుల సమస్యలు పరిష్కరించాలి



బిచ్కుందలో సమ్మె చేస్తున్న డాక్ సేవకులు

బిచ్కుంద(జుక్కల్): గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పోస్ట్ డాక్ సేవకుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీపీఎం హన్మాండ్లు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శుక్రవారం బిచ్కుంద పోస్టాఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. 20 ఏళ్ల నుంచి ప్రజా సేవలో ఉన్నా.. మా సేవలకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనికి తగిన వేతనాలు ఇచ్చి పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు జీడీఎస్‌లకు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోస్టల్ సిబ్బంది అశోక్, అనిల్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు నిలిపివేయాలి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని వాసవీ కాలనీలో బహుళ కంపెనీల సెల్‌టవర్ ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని వాసవీ కాలనీ అభివృద్ధి సొసైటీ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలో ఇప్పటికే గతంలో ఏర్పాటు చేసిన రెండు సెల్ టవర్లున్నాయని, రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యాలకు గురవుతున్నారన్నారని కమిషనర్‌కు మొర పెట్టుకున్నారు. వాసవీ కాలనీలోని జే.రాజామౌళి నివాసంపై కొత్తగా ఏర్పాటు చేస్తున్న టవర్ పనులను నిలిపివేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు మల్లూర్, ముగ్దుంపూర్, హెడ్‌స్లూయిస్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ కోత విధిస్తున్నామన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వ్యాపారులు, రైతులు, ప్రజలు, వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

మల్లయ్యపల్లిలో బోనాల పండుగ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మల్లయ్యపల్లిలో శుక్రవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ అమ్మవారికి మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. సర్పంచ్ ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతంతో అభిషేకం చేసి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రిశర్మ, మోహన్ ప్రమోద్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్ధాగౌడ్ పాల్గొన్నారు.

వంద శాతం బకాయిలు వసూలు చేయాలి

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని శుక్రవారం మండల పంచాయతీ అధికారి బ్రహ్మం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో వంద శాతం బకాయిలు వసూలు చేయాలని, హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని, దీంతో పాటు పంచాయతీ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం పంచాయతీకి సంబంధించిన క్యాష్ బుక్, హౌస్ టాక్స్ రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి గాజుల మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్

కామారెడ్డి అర్బన్: సోషల్ వర్క్ విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న దివ్యాంగులకు క్రీడలు నిర్వహించగా సోషల్‌వర్క్ విద్యార్థులు సేవలు అందించారు. దివ్యాంగులకు సేవలు అందించిన సోషల్ వర్క్ విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. సోషల్ వర్క్ విభాగం అధిపతి ఎం.చంద్రకాంత్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అకడమిక్ కో–ఆర్డినేటర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రధాన కాలువ వంతెన పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలో పోచారం ప్రధానకాలువపై వంతెనను శుక్రవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. శిథిలావస్థకు చేరడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు వంతెనను ఆయన పరిశీలించారు. వంతెనకు సైడ్‌వాల్స్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని ఆయన చెప్పారు. నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి ఉన్నారు.